

సాక్షి
పల్నాడు
మంగళవారం । 21 । జనవరి । 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 559.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,019 క్యూసెక్కులు విడుదలవుతోంది.

హుండీ ఆదాయం రూ.2,44,621



అల్లూరు(కర్లపాలెం): అల్లూరులోని రాజ్య లక్ష్మీ సమేత లక్ష్మీ నర సింహస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కిం చారు. రూ.2,44,621 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎంబీఎస్ వర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఉదయ్ కుమార్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల నూతన వైస్ ప్రిన్సిపాల్‌గా ఆచార్య ఎల్.ఉదయ కుమార్ నియమితులయ్యారు. సోమవారం యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు నియామక ఉత్తర్వులు ఉదయకుమార్‌కు అందజేశారు. అనంతరం ఆయన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆచార్య ఉదయ్ కుమార్ బుద్ధిజం విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షల కో–ఆర్డినేటర్‌గా, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్‌గా, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్‌గా పలు పదవులను నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా నియమితులవడంతో పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

23 నుంచి మిర్చి యార్డులో రైతులకు ఉచిత భోజనం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అమానత్ పట్టీలు ఆధారంగా రైతులకు ఉచిత భోజనం టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు. ఉచిత భోజన కేంద్రం వద్ద సిబ్బందిని కేటాయించి, వారికి శిక్షణ కూడా ఇచినట్లు తెలిపారు.

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్ల: రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ జైలును న్యాయమూర్తి సోమవారం పరిశీలించారు. ఆహారం, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. రిమాండ్ ముద్దాయిలు ఎన్ని రోజులుగా ఇక్కడ ఉంటున్నారని అడిగి తెలుసుకున్నారు. వారికి ఉన్న హక్కులను వివరించారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలు న్యాయవాదులను నియమించుకోలేకపోతే మండల న్యాయసేవ ఆధ్వర్యంలో సాయం అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తితోపాటు జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల సీఐ రాంబాబు, పారా లీగల్ వలంటీర్ కె.రాజారావు ఉన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారమవుతాయని సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ అడ్వకేట్స్ సుదర్శనా సుందర్, జి.శశిదేవి (చెన్నై) అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ(న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో ఎంపికైన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. న్యాయవాదులు అందరూ మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంలో భాగస్వాములు కావాలని వక్తలు తెలిపారు. ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్. సత్యవతి, సంస్థ కార్యదర్శి టి.లీలావతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిస్టెన్స్ డిగ్రీ కోర్సుల ఫలితాలు

ఏఎన్‌యూ(గుంటూరు ఈస్ట్): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గతేడాది అక్టోబర్/నవంబర్ నెలల్లో నిర్వహించిన పలు డిగ్రీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్లు దూరవిద్య పరీక్షల డెప్యూటీ రిజిస్ట్రార్ సయిద్ జైన్ లాబ్దిన్ సోమవారం తెలిపారు. ఫలితాల సీడీని యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు.

పొగ రాజుకుంది!

- ఖరీఫ్‌లో అధికంగా పెరిగిన విస్తీర్ణం
- రైతులకు లాభాలు వస్తుండటమే కారణం
- శనగ, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా రైతుల మొగ్గు
- పల్నాడు జిల్లాలో 13,728 ఎకరాల్లో సాగు
- సంప్రదాయ సాగు కంటే 307శాతం అదనం
- బోర్డు అనుమతికి మించి సాగు చేసిన రైతులు

జిల్లాలో విస్తారంగా పొగాకు సాగు




వినుకొండ రూరల్ మండలంలో సాగైన పొగాకు పంట

సాక్షి, నరసరావుపేట: పొగాకు పంట సాగుకు జిల్లాలో రెక్కలొస్తున్నాయి. సీజన్ సీజన్‌కు సాగు చేసే రైతులు సంఖ్య పెరుగుతోంది. ధరలు ఆశాజనకంగా ఉండటం, దిగుబడి బాగా వస్తుండటంతో పొగాకు సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో సాధారణ సాగుకు మూడింతల పంట జిల్లాలో సాగవుతోంది. పల్నాడు జిల్లాలో ఈ రబీలో సాధారణ సాగు 4,473 ఎకరాలు కాగా ఇప్పటికే జిల్లాలో 13,728 ఎకరాల్లో రైతులు పొగాకు సాగుచేశారు. ఇది సాధారణ సాగుకు 307 శాతం అధికంగా ఉంది. గతేడాది ఇదే సమయంలో 6,295 ఎకరాల్లో మాత్రమే పొగాకు సాగయింది. ఈ సంఖ్యల ద్వారా రైతులు పొగాకు సాగుకు ఎంత మొగ్గుచూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పోయిన ఖరీఫ్‌లో సైతం పొగాకు సాగు అధికంగా జరిగింది. ఖరీఫ్ సీజన్ పొగాకు సాధారణ లక్ష్యం 3,398 ఎకరాలు కాగా 4,095 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పొగాకు సాగు జిల్లాలో చిలకలూరిపేట, వినుకొండ, నూజెండ్ల, యడ్లపాడు, బొల్లాపల్లి మండలాల్లో అధికంగా ఉంది.

రైతులకు సిరులు...

పంట ఇతర పంటలతో పోల్చితే తక్కువ నీటితో పూర్తి అవ్వడం పొగాకు ప్రత్యేకత. దీంతో రైతులు సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఎకరం పొగాకు సాగుకు దాదాపుగా రూ.25వేలు – రూ.30 వేలు పెట్టుబడి అవుతుంది. ఇతర పంటలతో పోల్చితే ఇది తక్కువే. మరోవైపు ఎకరానికి 12–14 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తోంది. గతేడాది పొగాకు క్వింటా ధర సరాసరి రూ.17 వేలు పలికింది. ఈ లెక్కన 10 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వచ్చినా రూ.1.7 లక్షలు రైతుకు లభిస్తుంది. పెట్టుబడి పోనూ రూ.లక్షన్నర దాకా ఎకరానికి మిగులు లభిస్తుంది. దీంతో పొగాకు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



టుబాకో బోర్డు అనుమతి తప్పనిసరి

రైతులు ముందుగానే టుబాకో బోర్డు నుంచి ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నది అనుమతి తీసుకోవాలి. వారి నుంచి మాత్రమే పొగాకు దిగుబడులను కొనుగోలుచేస్తారు. అయితే పొగాకు సాగు లాభదాయకంగా ఉండటంతో కొంతమంది రైతులు అనుమతిపొందిన దానికన్నా అధికంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వం టుబాకో బోర్డుతో చర్చించి పండిన పంట మొత్తం కొనుగోలుచేసేలా చూడాలని కోరుతున్నారు.

లాభదాయకంగా ఉంది



పొగాకు సాగుకు రోజురోజుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. రైతులకు ఇతర పంటలతో పోల్చితే పొగాకు లాభదాయకంగా ఉండటమే కారణం. ఖర్చులు పోను ఎకరానికి రూ.1.25 నుంచి రూ.1.5 లక్షల దాకా మిగులుతోంది. మరోవైపు పంట దిగుబడి సైతం గత కొన్ని సీజన్‌లుగా బాగుంది. నీటి సదుపాయం తక్కువ అవసరం పడటం కూడా పల్నాడు రైతులు పొగాకు పంటవైపు వెళ్లడానికి మరోకారణం.

– ఐ.మురళి,
పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ధరలు ఆశాజనకం



నేను ఈ ఏడాది రబీలో 20 ఎకరాల్లో పొగాకు పంట సాగుచేశాను. పొగాకు పంటకు గత కొన్నేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. మరోవైపు మంచి దిగుబడి వస్తుండడంతో రైతులకు లాభాలొస్తున్నాయి. దీంతో గతం కన్నా అధికంగా ఈ ఏడాది సాగు చేశాను. మా గ్రామంలో రైతులు పొగు సాగుచేసే విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. శనగ, మొక్కజొన్న పంటలతో పోల్చితే పొగాకు పంట వల్ల లాభాలు బాగా వస్తుండటంతో రైతులు సాగు ప్రణాళిక మార్చుకుంటున్నారు.

– రావులపల్లి సుబ్బారావు,
పమిడిపాడు గ్రామం, నూజెండ్ల మండలం

అనుమతులు లభిస్తే మరింతగా సాగు..



సాగర్ జలాలు అందుబాటులో ఉండటంతో కాలువ చివరి భూముల్లో సైతం పొగాకు పంటను సాగుచేస్తున్నారు. నేను ఈ ఏడాది 10 ఎకరాల్లో పొగాకు సాగుచేశాను. ప్రభుత్వం పొగాకు ఎగుమతులకు అనుమతులిప్పిస్తే మంచి ధర లభించి రైతులకు మేలు జరుగుతుంది. మరింత మంది సాగు చేసేందుకు ముందుకు వస్తారు. లేదంటే ధరలు తగ్గి కొనుగోలుదారులు చెప్పిన ధరకే అప్పజెప్పాల్సి వస్తుంది.


– ఎన్నాబత్తుల వెంకట్రావు,
పమిడిపాడు గ్రామం, నూజెండ్ల మండలం

పాఠశాలల్లో ఓటరు దినోత్సవం నిర్వహించాలి

జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 25వ తేదీన 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లా పరిధిలోని ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు ఓటరు దినోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, రంగోలి, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించాలని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలను ఈనెల 23, 24తేదీలలో నిర్వహించి విజేతలకు ఈనెల 25వతేదీన జరగనున్న జాతీయ ఓటరు దినోత్సవ సభలో బహుమతులు అందిస్తామన్నారు.

యార్డుకు 90,567 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 90,567 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 77,096 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,200 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 54,523 బస్తాలు నిల్వఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

హేతువాద కవిరాజు

- రచనలతో సమాజాన్ని మేల్కొల్పిన కొండవీటి వెంకటకవి
- వెంకటకవి క్రోసూరు మండలం విప్పర్ల వాస్తవ్యులు
- సుప్రసిద్ధ రచయిత, హేతువాది, ఉపన్యాసకుడిగా ప్రఖ్యాతి
- 25న జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం



కవిరాజు కొండవీటి వెంకటకవి (ఫైల్)

క్రోసూరు: దేశవ్యాప్తంగా మతతత్వం పెచ్చురిల్లుతున్న నేటి తరుణంలో కలాన్ని ఖడ్గంగా చేసుకుని, తన జీవితాన్నే ఆయుధంగా మలిచి సంఘ సంస్కరణకు పూనుకున్న సాహితీవేత్త, హేతువాది, అభ్యుదయవాది, మహాకవి కొండవీటి వెంకటకవి. ఆయన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం విప్పర్ల వాస్తవ్యులు. కొండవీటి వెంకటకవి అసలు పేరు కొండవీటి వెంకటయ్య, తల్లిదండ్రులు నారాయణ, శేషమ్మలు. 1918 జనవరి 25న ఆయన జన్మించారు. ఈయన సతీమణి పేరు చిన్నమ్మ, వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు.

వెంకటకవి రచనలు..

వెంకటకవి తన 14వ ఏట నుంచి రచనలు చేయటం ప్రారంభించారు. 1932లో కర్షక శతకాన్ని రాశారు. అనంతరం హితబోధ, చెన్నవ కేశవ శతకం, 1954లో నెహ్రూ చరిత్ర మొదటి భాగం రచించి బెజవాడగోపాలరెడ్డికి, ద్వితీయభాగం గుత్తికొండ నరహరికి అంకితం చేశారు. త్రిశతి పేరుతో బుద్ధుడు, వేమన, గాంధీజీల గురించి మూడు శతకాలు రచించారు. 1984లో పోతులూరి బ్రహ్మం మఠానికి ఆస్థానకవిగా ఉంటూ శ్రీ వీర బ్రహ్మేంద్ర సుప్రభాతాన్ని సంస్కృతంలో రచించారు. 1977లో అగ్రనటుడు నందమూరి తారక రామారావు తీసిన దానవీరశూరకర్ణ సినిమాకు సంభాషణలు రాశారు. అలా చలన చిత్ర రంగానికి పరిచమయ్యారు. ఆ తరువాత శ్రీమద్విరాటపర్వం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి చరిత్ర చిత్రాలకు సంభాషనలు రాశారు. వీరు రచించి గ్రంథాలన్నీ కవిరాజు గ్రంథ మాల పేరుతో స్వయంగా ప్రకటించినవే కావటం విశేషం. అప్పట్లో ఎంఎన్ స్వూర్తితో, కమ్యూనిస్టు భావజాలంతో బాబాలను విమర్శిస్తూ ఉపన్యాసాలిచ్చారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి భావజాలంతో హేతువాదిగా మారి అనేక రచనలు చేశారు. మంత్రాలు లేకుండా త్రిపురనేని రామస్వామి రాసిన పెళ్లి సూత్రాలు చదివి అనేక వివాహాలు చేయించారు.

పురస్కారాలు..

1953లో గుంటూరు జిల్లా పెదకూరపాడులో వీరికి కవిరాజుగా బిరుదు ప్రధానం చేసి సత్కరించారు. 1971లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ కళాప్రపూర్ణ పురస్కారం. 1979 వెంకటకవి కవితా బ్రహ్మోత్సవాన్ని డాక్టర్ కొడాలి రంగారావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సత్తెనపల్లిలో నిర్వహించారు. ఎడ్లబండి కట్టి అంగరంగ వైభవంగా సినీనటులు ఎన్‌టీ రామారావు, కొంగర జగ్గయ్య లతో పాటు వెంకటకవిని సత్తెనపల్లి పురవీధుల్లో ఊరేగించి అశేష జనవాహిని సమక్షంలో పౌరసత్కారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంకటకవిని అధికార భాషా సంఘ సభ్యులుగా నియమించింది. వెంకటకవి 1991 ఏప్రిల్ 7న కాలం చేశారు. వెంకట కవి లాంటి గొప్ప రచయిత, హేతువాదిని తెలుగు ప్రజలు, నేటి విద్యార్థులు, యువత జ్ఞప్తికి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి అనుమతి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నిర్మాణం ఆగిపోయి ఉన్న సర్వీస్ బ్లాక్‌ను పూర్తి చేసేందుకు గుంటూరుకు చెందిన తులసి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు, గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి సంఘం సభ్యుడు తులసి రామచంద్ర ప్రభు ముందుకు వచ్చారు. గతంలో ప్రైవేటు కంపెనీ నిర్వాహకులు నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపివేశారు. సుమారు రూ.7.50 కోట్ల వరకు భవన నిర్మాణం పూర్తి చేసేందుకు తులసి రామచంద్ర ప్రభు ముందుకు రావడంతో భవన నిర్మాణం చేపట్టేందుకు ఆయనకు అనుమతి ఇస్తూ సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తయితే సెంట్రల్ కిచెన్, హాస్పటల్ స్టోర్స్, లాండ్రి, ఎంఆర్‌డీ విభాగం, సీఎస్ఎస్‌డీ విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. నాలుగు అంతస్తులతో భవన నిర్మాణం జరుగనుంది. జీఓ కార్యారూపణకు కృషి చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పీజీఆర్ఎస్‌లో 32 వినతులు స్వీకరణ



కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ గనోరే

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతీ ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనేరో, అధికారులతో కలిసి ప్రజల నుంచి 32 వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో జిల్లా నలు మూలల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్వేలు త్వరగా పూర్తిచేయండి..

నరసరావుపేట: జిల్లాలోని సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధరకాల సర్వేలు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మండల అధికారులు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయములోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేల నిర్వహణ, లక్ష్యాల పూర్తి విషయంలో వెనుకంజలో ఉన్న మండలాలు సర్వేప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్ సంబంధించి ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టిసారించి పూర్తిచేయాలన్నారు. జిల్లాలో చెత్త నుంచి సంపద కేంద్రాలు వచ్చేనెల 15నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 21 నుంచి 25, 27 నుంచి 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహించి 0 నుంచి ఆరేళ్ల వయస్సుగల పిల్లలకు ఆధార్ నమోదు చేయాలన్నారు. అనంతరం గృహనిర్మాణం, ఎంజీఎన్ఆర్‌జీఎస్, ఈకేవైసీ, ఎంఎస్ఎం ఈ సర్వీస్ కనెక్షన్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు అందజేశారు. మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయండి

కేంద్ర ప్రభుత్వం నరసరావుపేటలో క్రిటికల్ కేర్ యూనిట్ కోసం విడుదల చేసిన రూ.37కోట్ల నిధులతో వెంటనే యూనిట్ నిర్మాణం చేపట్టి జిల్లా ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలి. దీనికోసం వెంటనే తగిన స్థలం కేటాయించాలి. ఈ సదుపాయం లేకపోవటం వలన గుంటూరుకు పంపిస్తుండటంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– డి.శివకుమారి, శిలార్ మసూద్,
సీపీఎం నాయకులు

ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలి

ఆంగ్లం ద్వారానే ప్రపంచ దేశాలతో అనుసంధానం అవుతారు. ప్రభుత్వ విద్యాలయాల్లోని విద్యార్థులు ఆంగ్లం చదవకపోతే అవకాశాలు అందిపుచ్చుకోలేరు. పేద, శ్రామిక వర్గాల విద్యార్థుల కోసం ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగించాలి. డాక్టర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావు పూలే, సామాజిక శాస్త్రవేత్తలు ఇదే సూచించారు. ఆంగ్లానికి ఉన్న ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి.

– డి.ఏడుకొండలు, కె.మహమద్ నూర్, ఇంగ్లిషు మీడియం విద్యాపరిరక్షణ వేదిక

పట్టా పొలంలో రోడ్డు నిర్మాణం నిలిపివేయండి

- కోర్టు ఉత్తర్వులు ధిక్కరించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోండి
- డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- బాధిత రైతుతో కలిసి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు



కలెక్టర్‌కు పరిస్థితి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామ వైఎస్సార్ సీపీకి చెందిన రైతుల పట్టా పొలంలో కోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించి రోడ్డు నిర్మిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టా ల్యాండ్‌లో చేపట్టిన రోడ్డు నిర్మాణం వెంటనే నిలిపివేయాలంటూ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్‌లకు బాధిత రైతులతో కలిసి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ..గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నారనే కారణంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కామినేని వెంకయ్య, గ్రామ సర్పంచ్ కామినేని ఆదేయ్య, కామినేని నారయ్య సోదరులకు చెందిన తొమ్మిది ఎకరాల పొలంలో వేసిన సుమారు రూ.2.5లక్షలు విలువచేసే సుబాబుల్ చెట్లను డిసెంబర్ 29వ తేదీన టీడీపీ నాయకులు దౌర్జన్యంగా నరికి తీసుకుని వెళ్లారని పేర్కొన్నారు. అంతేకాకుండా సోమవారం ఉదయం నుంచి టీడీపీకి చెందిన వ్యక్తులు ఈ తొమ్మిది ఎకరాల పట్టా భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. దీని వలన సుమారు రూ.15లక్షల విలువైన ఎకరం పొలం పోతుందన్నారు. ఈ పొలంలో రోడ్డుకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టును ఆశ్రయించిన టీడీపీ నాయకులు కె.ఆంజనేయులు, కె.బ్రహ్మయ్యలకు వ్యతిరేకంగా నరసరావుపేట జూనియర్ సివిల్ కోర్టు పొలం పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు చెందిన పట్టా భూమి అని, ఇందులో ఎటువంటి రోడ్డు నిర్మాణం చేయడానికి వీలులేదని ఉత్తర్వులు ఇచ్చిందంటూ ఆ ఉత్తర్వుల కాపీలను గోపిరెడ్డి విలేకర్లకు చూపించారు. ఈ ఉత్తర్వులు కాపీని నాలుగు రోజుల క్రితం రొంపిచర్ల పోలీసులకు స్వయంగా తానే అందజేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ న్యాయస్థానం ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ వారు అక్రమంగా రోడ్డు నిర్మాణం కొనసాగిస్తున్నారన్నారు. దీనిపై తక్షణమే కలెక్టర్, ఎస్పీలు స్పందించి కోర్టు ఉత్తర్వులు ధిక్కరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకుడు కామినేని వెంకయ్య, షేక్ కరీముల్లా, ఎంఐఎం కరీముల్లా పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్మశానవాటికకు స్థలం కేటాయించండి

బెల్లంకొండ(పెదకూరపాడు): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం న్యూ చిట్యాల (మాచాయపాలెం ఆర్ ఆర్ సెంటర్) గ్రామంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరావులకు లంబాడీ ఐక్యవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు భూక్యా రామాంజనేయులు నాయక్ సోమవారం వినతిపత్రం అందించారు. పులిచింతల ప్రాజెక్ట్ ముంపు గ్రామలైన చిట్యాల, చిట్యాల తండా, కేతవరం, కేతావరం తండా, బోధనం, కోళ్లూరు గ్రామాల గిరిజన ప్రజలను మాచాయపాలెం ఆర్ఆర్ సెంటర్‌లోకి తరలించి 14 సంత్సరాలు అవుతుందని, ప్రభుత్వాలు మారినా గిరిజన జీవితాల్లో మార్పు లేదన్నారు. ఈవిషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి వివరించామన్నారు. స్మశాన వాటిక స్థల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, గ్రామంలో మౌలిక సదుపాయలు డ్రైనేజీ, తాగునీరు, అంగన్‌వాడీ భవనం, ప్రాథమిక పాఠశాల తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన జాటోత్ హుస్సేన్ నాయక్ ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు, జాతీయ ఎస్టీ కమిషన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ ద్వారా ప్రతిపాదనలు పంపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తుమ్మకోటలో పులి గుర్తులు అవాస్తవం

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సత్యనారాయణ



రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామ సమీపంలో నల్లమల అడవిప్రాంతంలో శనివారం కనిపించినవి పులి గుర్తులు కాదని ఫారెస్ట్ బీట్ అధికారి సత్యనారాయణ సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా తుమ్మకోట గ్రామ పరిసరాలలో నున్న నల్లమల అటవీప్రాంతంలో పెద్దపులి సంచరించి ఆవుదూడను చంపిందని ప్రజలు చర్చించుకున్నారని, దీంతో తుమ్మకోట గ్రామానికి చెందిన పశువుల కాపరి బాలునాయక్‌తో పాటు మరికొందరు గ్రామస్తులతో అడవిలోకి వెళ్లి ఆవులు మేతకోసం వెళ్లిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడ ఓ ప్రాంతంలో రాళ్ల మధ్య ఆవుదూడ కాలు ఇరుక్కొనిపోవడంతో ఆ ఆవుదూడకు తీవ్ర గాయం కావడంతో అది పెద్దగా అరవడంతో భయపడిన పశుకాపరి, ఆవులు పారిపోయి పరుగెత్తడం జరిగిందన్నారు. అదే పెద్దపులి అయినా.. చిరుతపులి అయిన ఆవుదూడను చంపితీసుకొని వెళ్లిపోవడం జరిగేదన్నారు. కానీ ఇక్కడ రాళ్ల మధ్య కాలు విరిగి ఆవుదూడ అక్కడే కిందపడి ఉందన్నారు. ఈ ప్రాంతంలో పెద్దపులి, చిరుతపులుల గుర్తులు ఏవీ లేవన్నారు. అటవీశాఖ అధికారులు తుమ్మకోట గ్రామ సమీపంలో నున్న ఈ అడవిలో పులి లేదని నిర్ధారించడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

అందరి లక్ష్యం..వైఎస్సార్ సీపీ బలోపేతం

- సుధీర్ భార్గవ్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించండి
- రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా సుధీర్ భార్గవ్‌రెడ్డి బాధ్యతలు స్వీకారం



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, పక్కన సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలని సుధీర్ భార్గవ్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. సత్తెనపల్లిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద సోమవారం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి బాధ్యతల శ్రీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ పరిచయ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు పార్టీ నాయకుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ సుధీర్ భార్గవ్‌రెడ్డిని తనతో పాటు శాసనసభకు తీసుకు వచ్చే బాధ్యతను జగన్‌మోహన్‌రెడ్డి తనపై పెట్టారన్నారు. భార్గవ్ రెడ్డి గెలుపు కోసం పని చేస్తానన్నారు.

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్ర బాబు రాష్ట్రంలో దౌర్భాగ్య పరిపాలనను కొనసాగిస్తున్నాడన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా క్యాష్ ఇస్తే ఏ పనైనా చేసేలా ప్రస్తుతం పరిపాలన సాగుతుందన్నారు. ఒక కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావుకు సత్తెనపల్లి నియోజకవర్గాన్ని కాంట్రాక్ట్‌గా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇచ్చేశాడన్నారు. చంద్రబాబు ఇంటిలో పాలన అబ్బాయికి ఇచ్చేయమని గొడవ జరుగు తుందన్నారు. అందువల్లనే టీడీపీ నేతలు లోకేష్‌ను ఉపముఖ్యమంత్రి చేయాలంటూ స్వరం పెంచుతున్నారని, ఫలితంగా లోకేష్‌ను ముఖ్యమంత్రి చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని నిర్ణయించుకున్నారన్నారు.



పెద్ద ఎత్తున వచ్చిన కార్యకర్తలు, అభిమానులు

సభలో నాయకులు నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరి బాబు, పెండెం బాబురావు, షేక్ నాగూర్ మీరాన్, రాజవరపు శివనాగేశ్వరరావు, పడాల శివారెడ్డి, భవనం రాఘవరెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు మాట్లాడారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వనిపెంట వీరారెడ్డి, దొంతిరెడ్డి సునీత, తేలుకుట్ల రాజేశ్వరి, కోటేశ్వరరావునాయక్, ఎమ్‌జెఎమ్. రామలింగా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాస రావు, షేక్. మౌలాలి, కళ్ళం విజయభాస్కర రెడ్డి, సంకటి శ్యాంసన్, రోళ్ల. మాధవి, అచ్యుత శివప్రసాద్, వెంకట్రామిరెడ్డి, రెండ్డెద్దుల. వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, ప్రజాప్రతి నిధులు డాక్టర్ సలీమ్, పెద్దింటి వెంకటేశ్వర్లు, సతీష్, మల్లికార్జునరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, ఏసుబాబు, పార్టీ నాయకులు చిలుకా జైపాల్, శివనారాయణ, నరసింహారావు, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, యాసారపు బాబు, కాశీమాల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం..

సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో కొనసాగుతూ సేవలందిస్తున్నానని, రాజకీయంగా కార్యకర్తలు అందరికీ అండగా ఉంటానన్నారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే తన ముందున్న లక్ష్యమన్నారు. అనంతరం మాజీ మంత్రి అంబటి రాంబాబును పూల మాలలు, దుశ్శాలువాలతో సుధీర్ భార్గవ్ రెడ్డి సత్కరించారు. అలాగే సుధీర్ భార్గవ్ రెడ్డిని నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు, పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు.

టీడీపీ నాయకులు కందిపంట దొంగిలించారు

- పోలీసు పీజీఆర్ఎస్‌లో బాధితుల ఫిర్యాదు
- 77 అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే కుటుంబ, ఆర్థిక, ఆస్తి, చోరీ, తగాదాల సమస్యలకు సంబంధించి 77 ఫిర్యాదులు స్వీకరించారు.

బెదిరించి పంట అపహరించారు

నాకు, టీడీపీ వర్గీయుడైన సుబ్బారావుకు మూడెకరాల వద్ద ఉన్న గొడవను పదేళ్ల క్రితం పెద్దమనుషులు పంచాయితీ చేసి రెండెకరాలు నాకు, ఒక ఎకరం సుబ్బారావుకు పంపిణీ చేశారు. అతను ఆ పొలాన్ని కౌలుకు ఇచ్చుకొని విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇప్పుడు వచ్చి నా రెండు ఎకరాలు కూడా తనవేనంటూ నాపై దాడిచేసి కొట్టారు. గ్రామంలోని అతని వర్గీయులైన టీడీపీ వారితో కలిసి నాపొలంలోని కందిపంటను బలవంతంగా కోసితీసుకొని పోయారు. ఇప్పటికి రెండుసార్లు వచ్చి ఎస్పీకి ఫిర్యాదు చేశా. స్థానిక పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మీరైనా కేసు నమోదుచేసి నాకు న్యాయం చేయండి.

– సిరియాల శ్రీను, రామాంజనేయపురం, బెల్లంకొండ మండలం

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.20లక్షల మోసం

నా కుమారునికి భూక్య చిన్న నాయక్ అనే అతను ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు అడిగితే లారీతో తొక్కించి చంపుతానని బెదిరిస్తున్నాడు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి.

– అంగోతు హునికిభాయి, శ్రీరాంపురం తండా, వెల్దుర్తి మండలం

పెన్షనర్ల ప్రతినిధిగా ఎమ్మెల్సీ కావాలి

రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణారావు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్ల రూరల్: రాష్ట్రంలో ఉన్న మూడున్నర లక్షల మంది పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వానికి నివేదించేందుకు భవిష్యత్తులో వారికి జరిగే కష్టనష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక ప్రజాప్రతినిధిని, ఎమ్మెల్సీని నియమించుకోవాలని రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి గాదె రామకృష్ణారావు కోరారు. సోమవారం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్సీలు ఉన్నారని, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా ఎమ్మెల్సీ ఉండాలన్నారు. క్వాంటం ఆఫ్, కమ్యూనికేషన్ రికవరీ పెన్షన్ గురించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహయ్య మాట్లాడుతూ పెన్షన్‌దారులందరూ లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి అందజేయాలన్నారు. రిటైర్డ్ అధ్యాపకుడు జక్కిరెడ్డి మర్రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని, డీఏ, పే రివిజన్ కమిషన్ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కోశాధికారి కె.గాలీబ్, కార్యదర్శి చంద్రయ్య, గౌస్ మొహిద్దిన్, సుబ్బారావు, సీతరామయ్య, అంజిరెడ్డి, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడైన పైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు

జే.పంగులూరు: ఓ ప్రైవేటు కంపెనీ కలుపు మందు వినియోగించగా దెబ్బతిన్న పంటను శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ముప్పవరం గ్రామ పరిసర ప్రాంత రైతులు అగస్త్య కంపెనీ కలుపుమందు పిచికారీ చేయగా మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్న విషయం విదితమే. పంట దెబ్బతిన్న పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో కలుపు మందు వాడి ఎదుగుదల లేని మొక్కలు, మోము ఎండిన మొక్కలను పరిశీలించి నమూనాలను తీసుకెళ్లారు. నష్టానికి గల కారణాలు మొక్కలను పరిశీలించి నివేదిక పంపుతామని గుంటూరు లాం ఫారం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభశ్రీ తెలిపారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, కలుపు మందు పిచికారీ చేసే సమయంలో తప్పకుండా నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. మందు మోతాదు, నీటి పరిమాణం తీసుకొని సూచించిన మేరకు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ (ఆగ్రానమి) డాక్టర్ దయానా, గ్రేజ్ సైంటిస్ట్ (ఎంటమాలజీ), అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్టూరు కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టెక్నీషియన్లు సమర్థంగా ల్యాబ్‌లు నిర్వహించాలి

శిక్షణను ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి

నరసరావుపేట: జిల్లాలోని పలు ప్రభుత్వ హాస్పిటళ్లు, హెల్త్ సెంటర్లలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు రక్తపరీక్షల నిర్వాహణకు మెలకువలను నేర్చుకొని మలేరియా నిర్ధారణ సక్రమంగా చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో ప్రైమరీ, అర్బన్, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, హాస్పిటళ్లలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లకు వారం రోజులపాటు నిర్వహించే ఓరియంటేషన్ ట్రైనింగ్‌ను ప్రారంభించారు. ఈ శిక్షణను డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి ప్రారంభించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ వారం రోజులపాటు ఇచ్చే శిక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు పకడ్బందీగా తర్ఫీదు పొంది ల్యాబ్‌లను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. విజయవాడ సెంట్రల్ మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ కల్యాణి రక్తనమూనాలు ఏవిధంగా సేకరించాలనే విషయాలను వివరించారు. ఏఎంఓ వెంకటేశ్వర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులతో పాఠశాల బృందం

తాడేపల్లిరూరల్: బాలల హక్కులను పరిరక్షణే ధ్యేయంగా వ్యవస్థలన్నీ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాజేంద్రనాథ్, పద్మావతి సూచించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌ను సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ జీవితంలో ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషిచేయాలన్నారు. సోషల్‌మీడియాను పరిమితంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఆహారం వండే విధానం, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం పిల్లల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్. బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్. శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెస్సీరాజ్‌కు గుంటూరు జిల్లా కలెక్టర్ అభినందన



గుంటూరు వెస్ట్: ప్రపంచ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటి, ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం అందుకున్న జెస్సీరాజ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. జెస్సీరాజ్ అద్భుత ప్రతిభతో జిల్లాకు, రాష్ట్రానికి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

తమ్ముడిపై కత్తితో అన్న దాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బయటకు పొక్కకుండా ఆస్పత్రిలో చేర్పించిన అన్న, వదిన
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడి భార్య
- పట్టించుకోని పోలీసులు
- కుటుంబ గొడవలో తలదూర్చిన విజయవాడ టీడీపీ కార్పొరేటర్!



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరిఫ్

తాడేపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో తన భర్తపై కత్తితో దాడి చేసి కదల్లేని స్థితికి తీసుకొచ్చిన బావ, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఓ మహిళ విలేకరుల ఎదుట సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం ప్రకారం షేక్ ఆరిఫ్, ఆసిఫ్ అన్నాదమ్ములు. వీరి తల్లి షేక్ జమీల. ఆరిఫ్‌కు అన్న ఆసిఫ్ వదిన ఆయిషా, తల్లి షేక్ జమీలకు మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఆరిఫ్ భార్య సల్మా కాన్పు కోసం విజయవాడలోని ప్రభుత్వ ఆస్పతిలో గతనెలలో చేరింది. ఆ సమయంలో ఆరిఫ్‌కు అతని వదిన ఆయిషా, అన్నయ్య ఆసిఫ్‌కు మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12న ఆసిఫ్ ఆరిఫ్‌ను కత్తితో విచక్షణ రహితంగా పొడిచాడు. అనంతరం ఆస్పత్రిలో చేర్పించి ఎవరికీ తెలియకుండా చికిత్స చేయించారు. అనంతరం తీసుకొచ్చి ఇంట్లోనే ఉంచి బంధించారు. ఆరిఫ్ భార్య సల్మా ఆస్పత్రి నుంచి జనవరి 10న ఇంటికి వచ్చి కదల్లేని స్థితిలో ఉన్న భర్తను చూసి ఏమైందని ప్రశ్నించింది. దీంతో అత్త, బావ, తోడికోడలు బెదిరింపులకు దిగారు. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలని, లేకుంటే నిన్ను, నీ పిల్లలనూ చంపుతామంటూ బెదిరించారు. దీంతో సల్మా కదల్లేని స్థితిలో ఉన్న భర్త, 15రోజుల పసిగుడ్డుతో కలిసి పోలీసులను ఆశ్రయించారు. అయినా పోలీసులు కనికరం చూపలేదు. వారం రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా కేసు నమోదు చేయలేదు. ఆదివారం విజయవాడకు చెందిన టీడీపీ కార్పొరేటర్ హర్షద్ వచ్చి సల్మా, ఆరిఫ్‌లను బెదిరించారు. ఇప్పటికే తీవ్రంగా గాయపడిన ఆరిఫ్‌కు మరో ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. దీంతో సల్మా విలేకరులను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని కన్నీమున్నీరయ్యారు.

అంతర్ రాష్ట్ర బైకు దొంగ అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న నగరంపాలెం సీఐ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ఉన్న ద్విచక్రవాహనాలను చోరీ చేసే అంతర్ రాష్ట్ర దొంగను వేలిముద్ర స్కానర్ ఆధారంగా నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.నజీర్ కేసు వివరాలను వెల్లడించారు. హనుమయ్యనగర్‌కు చెందిన మాదాల సురేష్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 15న రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో మరో రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురికావడంతో అదనపు ఎస్పీ సుప్రజ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసుల సహకారంతో నగరంపాలెం సీఐ నజీర్ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నగరంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పాత నేరస్తులను విచారించారు. థంబ్ ప్రింట్ (వేలిముద్ర) స్కానర్ ద్వారా విచారణ చేపట్టారు. దీని ఆధారంగా వాహనాలు చోరీ చేసింది దేవాపురానికి చెందిన పులి రమేష్‌గా గుర్తించి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. రమేష్ నుంచి ఐదు ద్విచక్రవాహనాలను రికవరీ చేశారు. రమేష్‌పై జిల్లాలోనే అనేక పోలీస్ స్టేషన్లలో 52 కేసులు ఉన్నట్లు గుర్తించారు. సోమవారం రమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రమేష్‌ను పట్టుకునేందుకు ప్రతిభ కనబరిచిన నగరంపాలెం సీఐ ఎం.నజీర్‌ను ఎస్సై సలాంను సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ముగ్గురిపై కత్తితో దాడి

చిట్టీల వివాదమే కారణం!

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చిట్టీ వివాదం నేపథ్యంలో ముగ్గురిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన ఘటన సోమవారం జరిగింది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన చల్లగొల్ల రమేష్ అదే ప్రాంతానికి చెందిన సింగయ్య ద్వారా రూ.లక్ష చిట్టీ వేశాడు. మూడు నెలలుగా రమేష్ డబ్బులు చెల్లించకపోవడంతో నిర్వాహకులు సింగయ్యకు ఫోన్ చేసి రమేష్ డబ్బులు చెల్లించలేదని, మధ్యవర్తిగా ఉన్న నువ్వు చెల్లించాలని చెప్పారు. దీంతో ఆగ్రహంతో సింగయ్య రమేష్‌కు ఫోన్ చేసి అసభ్యపదజాలంతో తిట్టాడు. రమేష్ సోమవారం తన కుమారుడు యశ్వంత్, బావమరిది నాయుడును తీసుకుని సింగయ్య ఇంటికి వెళ్లి చిట్టీ డబ్బులు చెల్లించాడు. డబ్బు కట్టడంలో కొంత ఆలస్యమైనంతమాత్రాన ఇష్టం వచ్చినట్టు బూతులు తిట్టడం సరికాదని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగయ్యకు, రమేష్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది ఈ క్రమంలో సింగయ్య కుమారుడు మల్లికార్జునరావు ఇంట్లో ఉన్న కత్తితో రమేష్ కుమారుడు యశ్వంత్, నాయుడులపై కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన రమేష్ తలపై దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సింగయ్య, మల్లికార్జునరావులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన రమేష్, యశ్వంత్, నాయుడులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. పోలీసులు ఇరువు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.